# 'చూసినవన్నీ చెప్పెయ్యకు'

రవణప్ప అని, నేను చదువుకునే రోజుల్లో తను కూడా చదువు 'కొందామని' ప్రయత్నించేవాడు. ఏ క్లాసు కా క్లేసే డింకీలు కొట్టిస్తూ చివరికి మా మేష్టార్ల దృష్టిలో ఎందుకూ పనికిరాని వాడైపోయాడు.

మా వూళ్ళో ఆ రోజుల్లో, మేం హైస్కూల్ లెవెల్లో వుండగానే మాకు కాలేజి శాంక్షన్ అవడం, ఆ హైస్కూలు మాస్టర్లలోనే ఎమ్మేలూ ఎమ్మెస్సీలూ కొందరు ఆ కాలేజీలో లెక్చరర్లయిపోవడం జరిగి, కింది క్లాసుల్లో మమ్మల్ని క్షుణ్ణంగా తెలియడంచేత బిఎస్సీలో కొచ్చినా ఏరా, బోడి వెధవా అనెయ్యడం, చిన్న చిన్న తప్పులకి కూడా తల్లిదండ్రులు ల్లాగా, మేనమామల్లాగా, బాబాయిల్లాగా చివాట్లెయ్యడం తప్పింది గాదు. కొత్తగా ఇంటర్లోనో, బి. ఏ. లోనో మా కాలేజికొచ్చి చేరిన పొరుగూరి కుర్రాళ్ళకి మా మేష్టార్లనుంచి మా కన్నా ఎక్కువ మర్యాద జరగడం మాకెంతో ఇబ్బందిగా వుండేది కూడానూ. అయితే అందులో కొందరు, మేం మేష్టార్లకి ఏదో దగ్గిర బంధువులం అనుకుని మమ్మల్ని కాకాలు పట్టిన సందర్భాలు కూడా లేకపోలేదు.

ఈ రకం ఆత్మీయతకి రవణప్ప నోచుకోలేదు. వాడు అతికష్టం మీద తొమ్మిదో క్లాసునుంచి పదో క్లాస్ కొచ్చేటప్పటికి ఆ క్లాసులకి సరికొత్త, ధగధగాయమానులైన, బియ్యే యీడీలు చేరిపోయారు. వాడు పదోక్లాసు పాసవడం అంటూ జరగనేలేదు. గనక వాణ్ణి మేష్టా ర్లెవరూ ఒరే అనీ అడ్డగాడిదా అనీ పిలువనేలేదు.

అలాగ మేష్టార్లచేత ఒరే, చవటా, ఇడియటూ అనిపించుకునే స్వాతంత్ర్యం మాకు జన్మహక్కైందిగాని రవణప్పకి కాలేదు. స్వాతంత్ర్యం ఎన్ని రకములు, అవి యేవి? అని మాలో మేం సర దాగా ప్రశ్నించుకుని, తిట్టించుకునే స్వాతంత్ర్యం మనకు అదనంగా వుందని సంతోషపడి పోయేవాళ్ళం.

బీకామ్ పాసై స్టేట్ బ్యాంకిలో కేషియర్ ఉద్యోగం సంపా దించుకుని, మళ్ళీ అక్కడ పరీక్షలురాసి హార్డు వర్కుచేసి చీఫ్ కేషి యర్‌నైనాను. పన్నెండేళ్ళపాటు పరాయి వూళ్ళలో అద్దె యిళ్ళల్లో వుంటూ చివరికి మా వూరికి వేస్తే ఎగిరి గంతేసి వొచ్చాను. వచ్చిన నెల రోజుల్లోనే రవణప్ప నాకు గమ్మత్తుగా తగిలాడు.

మనిషి నల్లగా వున్నాడు. తుమ్మమొద్దులాగా, తాటి బొందలాగా ఒకటే మందాన పోత విగ్రహంలాగా వున్నాడు. జుట్టు వొత్తుగా వుంది. తెల్లటి పల్చటి లాల్చీ- తెల్లటి ప్యాంటూ తొడిగాడు. లాల్చీ కిందనుంచీ, మెడలోంచీ సన్నటి ఒంటిపేట బంగారు గొలుసూ, మధ్యలో పులిగోరు పతకం కనపడుతున్నాయి. రెండు చేతులకీ బొటన వేళ్ళకి తప్ప మిగతా అన్ని వేళ్ళకీ ఉంగరాలున్నాయి. "ఎక్స్‌క్యూజ్మీ! అయామ్ రమణ్‌లాల్" అన్నాడు. నాకు అలవోకగా షేక్హాండిచ్చేసి, నా కుడిచెయ్యి అలవాటుగా ఆటోమాటిక్‌గా అందుకుంది ఆ హాండ్‌ని. "బైఠియే, బైఠియే" అని కూడా అన్నాను. అతను బైఠాయించాక 'వర్మాయియే' అని కూడా అన్నాను.

"సారీ సార్, నాకు హిందీ రాదు. తమరు తెలుగువాళ్ళే అని విన్నాను?" అన్నాడు.

"అయ్యో దానికేముందీ? మీ పేరు రమణ్‌లాల్ అంటేనూ—" అని గుటక వేశాను.

"అది వ్యవహార నామంలెండి. అసలు పేరు రమణ, చిన్నప్పు డంతా రమణప్ప అనేవారు. అనంతపూర్‌లో కాంట్రాక్టులు చేసినప్పుడు నేనేదో కన్నడ దేశస్థుడ్ని అనుకుని కొంచెం ఇదిగా చూస్తే ఆలిండియా అప్లికబిలిటీకోసం రమణ్‌లాల్ అని మార్చుకున్నాను" అని వివ రించాడు.

నేను విజయగర్వంతో "అయామ్ సుబర్‌మన్యం. మనం ఈ ఊళ్ళో రాజాస్ హైస్కూల్లో ఫస్టుఫారంలో క్లాస్మేట్స్" అన్నాను.

నా విజయగర్వం సరిగ్గా మూడేళ్ళుంది.

రమణ్‌లాల్ అలా వచ్చినవాడు కనిపించడమే, మళ్ళీ రాలేదు. ఆ రోజున కొంత బంగారం మా బ్యాంకిలో తాకట్టుపెట్టాడు. గీటుపెట్టే ఉద్యోగిచేత ఔననిపించుకుని ఫారాలు నింపించి పద్దెనిమిది వేలు ముట్ట చెప్పాను. మూడేళ్ళ తరువాత మా బ్రాంచి మేనేజర్‌గారికీ, నాకూ ఒకేసారి ప్రమోషన్లు ట్రాన్స్‌ఫర్లూ వస్తే తప్ప ఈ ఖాతాలో వడ్డీగాని అసలుగాని జమ పడలేదని గుర్తించలేదు. అప్పుడు పద్ధతిగా చెకింగూ వప్పగింతలూ చెయ్యడంలో రమణ్‌లాల్ మా బ్యాంకిలో తాకట్టెట్టింది. అసలు బంగారమే కాదని తేలింది. గిల్టు నగలు తాకట్టు పట్టుకుని గిల్టీ కారెక్టరునయాను.

"వాడా బాబూ మీకు తగిలాడు? వాడెవరనుకున్నారు? లోగడ దూసి బ్రిడ్జిమీద రైలుకి ఇంజిన్ ట్రబులిప్పించి ఆపేసి, కత్తి చూపించి ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్లోంచి లక్షా యాభై వేలు దోపిడీచేసిన గజదొంగ. రాత్రిపూట, ఒడుపుగా, పారుతున్న నాగావళి నదిలో దూకేసి రాయల సీమ పారిపోయిన ప్రబుద్ధుడు?" అని చెప్పాడు. నా దగ్గిర ఛార్జ్ తీసుకుని నాకు ఛార్జ్ మెమో ఇప్పించిన పంచాపకేశన్.

"ఆ సంఘటన నేను విన్లేదే!" అన్నాను.

"అవును. అప్పట్లో దోపిడీలూ, మానభంగాలూ, హత్యలూ పేపర్లలో రాసేవారు కాదు."

"ఏం?"

"వార్తలు ప్రచురించడంలో అప్పటి పద్ధతి అది. నేరాల గురించి వాటి నిర్వహణ గురించి మోడస్ ఓపెరాండి గురించి పోలీసు లకి తప్ప సామాన్య జనానికి తెలిసేదిగాదు. అందువల్ల, కనుక, క్రైమ్ అనేది మరీ గుండెలీసిన బంట్లకే పరిమితం అయిపోయి, క్రైమ్ రేటు తక్కువగా వుండేది. ఇప్పుడు ఎనిమిదేళ్ళ పిల్లాడు సినిమాల్లోను, టి. వి. ద్వారాను దోపిడీలు, హత్యలు, మానభంగాలు చూస్తున్నాడు. అక్షరజ్ఞానం వుంటే చాలు; పత్రికల్లో వివరంగా,

వైనంగా వస్తున్న నేర నిర్వహణ పద్ధతులను గ్రహిస్తున్నారు. ఇలా కాక మరో రకంగా అన్న ధోరణిలో కొత్త కొత్త పద్ధతుల్లో నేరాలూ, మోసాలూ చెయ్యడం కొందరు జీవన విధానంగా స్వీకరిస్తున్నారు కూడాను—"

"అయ్యబాబోయ్ చచ్చామే!"

"ఏం జరిగితే అది పత్రికల్లో ప్రచురించి, జనం దృష్టికి తెచ్చి వాళ్ళను జ్ఞానవంతులను చెయ్యాలని అసలు ఉద్దేశం. ఆకర్షణీయమైన వార్తల్ని ప్రచురించడం పాప్యులర్ కావడం, ఇందులోంచి వచ్చిన మరో మార్గం."

"ఇదివరకట్లాగా వుంటేనే బావున్నట్టుందే?" అన్నాను.

"అవును. మీరనుకున్నట్టుగానే దేశభక్తులూ, ప్రజాశ్రేయస్కారములూ కూడా ఇప్పుడిప్పుడు తలుస్తున్నారు. త్వరలో ఒక శాసనం వచ్చినా ఆశ్చర్యం లేదు."

"ఎలాంటిది?"

"మీ యిష్టం వచ్చిన వార్తల్ని మీ యిష్టం వచ్చిన ధోరణిలో ప్రచురించుకోండి, కాదనం. కాని మేం మొత్తం సుమారు నాలుగువేల మందిమి ఉంటాం, మా గురించి మాత్రం ఏం వ్యాఖ్యానించకండి. మేం వాళ్ళు తెలియని ఆవేశంలో వాదించుకున్నా, తిట్టుకున్నా, కుర్చీలు విసిరికొట్టుకున్నా, ఆఖరికి ఉపన్యాసాలప్పుడు మైకులు లాగేసి వాటితోనే కొట్టుకున్నా, సభల్లోంచి మాలో కొందర్ని పోలీసులు మెడలుపట్టి గెంటేసినా ఆ వార్తలు మాత్రం యథాతథంగా వెయ్యడానికి వీల్లేదని—"

"అవును సుమండి! అలాంటి శాసనం చేసేస్తే బోలెడు న్యూస్‌ప్రింటు ఆదా అవుతుంది కూడాను" అని ఒప్పేసుకున్నాను.

(9-4-84)

(28)